క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శెట్టూరు: మండలంలోని ములకలేడు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మంజుళ, నితిన్ రాష్ట్రస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహులు తెలిపారు. వీరు ఈనెల 28 నుంచి 30 వరకూ ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 16న అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు, పీఈటీ శివకేశవులును ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సచివాలయం తనిఖీ

విడపనకల్లు: పాల్తూరులో రెండో నంబర్ సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించి, సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. సచివాలయం-2 పరిధిలోని చేపట్టిన పలు అభివృద్ధి పథకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం కూడా అర్హులందరికీ చేరాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రథమ లక్ష్యమని గుర్తు చేశారు. పొరపాటున కూడా అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదంటే పూర్తిగా సచివాలయ ఉద్యోగులే బాధ్యులవుతారని హెచ్చరించారు.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

బొమ్మనహాళ్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన, నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ తిమ్మప్ప ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని దేవగిరి క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. కొది సేపు విద్యార్థులకు పాఠాల బోధించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పౌష్టికాహారంతో కూడిన భోజనం పెట్టాలన్నారు. మెనూ రోజూ అమలు చేయాలన్నారు.

'లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు'



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వధూవరులను ఆశీర్వదిస్తున్న కాపు భారతి

రాయదుర్గం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టబోయే పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ ఉండదని, గత ఐదేళ్ల అధికారం ఇస్తే తండ్రీకొడుకులు చేసిన అభివృద్ధి ఎంటో ప్రజలకు తెలుసు అని ప్రభుత్వ విప్ కాపు సతీమణి, జిల్లా రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి ధ్వజమెత్తారు. గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు పద్మశాలి కిష్టప్ప కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు సభ్యుడిగా కూడా గెలవని లోకేష్ పాదయాత్ర చేపట్టడం వల్ల వైఎస్సార్‌సీపీకి నష్టం లేదన్నారు. కార్యక్రంలో సర్పంచ్ ఎస్ రమేష్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జెడ్పీటీసీ పీఎస్ మహేష్, వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, సిరిగే జయమ్మ, మండల కన్వీనర్ బోయ మంజునాథ, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఉపకరణాల ఎంపికకు ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమారి

కళ్యాణదుర్గం: స్థానిక నార్త్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల ఎంపికకు ఎంఈఓ విజయకుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రంతో పాటు బెళుగుప్ప మండలాలకు చెందిన సుమారు 102 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో వినికిడి లోపం, శారీరక వికలాంగులు, పోలియో చిన్నారులకు, రోటేటర్స్, సీపీ చైర్స్, సంక కర్రలు తదితర వాటిని గుర్తించారు. త్వరలోనే అందరికీ ప్రభుత్వం తరపున ఉచితంగా పరికరాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ఐఈడీ షామి, వెంకటరమణ, డాక్టర్ సతీష్ కుమార్, మెడికల్ ఆఫీసర్ తిరుపాల్

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు

- మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు రంగమ్మ. కుటుంబంతో కలిసి వడ్డెపాళ్యంలో నివసిస్తోంది. ఈమె కుటుంబానికి నవరత్నాల్లోని పథకాలు ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా అందాయి. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలు, అమ్మఒడి ద్వారా రూ.29 వేలు, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, పంటల బీమా ద్వారా రూ.5,854 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.11,152, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.1,500 లబ్ధి చేకూరింది. తన జీవితంలో పథకాల ద్వారా ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు అందలేదని రంగమ్మ తెలిపింది. కుటుంబం అంతా జగనన్నకు అండగా ఉంటామని చెబుతోంది.



కుందుర్పి: వడ్డెపాళ్యంలో పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



కూడేరు: పథకాల లబ్ధిని వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

కుందుర్పి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు వెల్లువ కొనసాగుతుండడంతో ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. బుధవారం మండలంలో వడ్డెపాళ్యం గ్రామంలో సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తదితరులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ.. బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం జగనన్న రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని కొనియాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వాల్మీకి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పాలాక్షి, సుజాతమ్మ, సొసైటీ అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాము, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, నాయకులు రాయప్ప, అంజి, పెద్దరాజు, మల్లేసి, మాజీ ఎంపీటీసీ గోవిందు, డీలర్ నాగరాజు, హనుమంతప్ప, ఓబన్న, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అండగా నిలవాలి..

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎంఎంహళ్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంత మొత్తంలో గతంలో ఏ ప్రభుత్వం కూడా అందించింది లేదని, సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే చెప్పాలని ప్రజలను కోరారు. పలు సమస్యలను తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సీఎం జగన్ మేలును ఎప్పటికీ మరువమని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యుడు సర్దార్, వైఎస్సార్‌సీపీ నేతలు తుప్పటి హరీష్, బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, తిమ్మరాయుడు, ఓబన్న, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, అక్కులన్న, గోవింద్, కిష్టప్ప, సూర్యనారాయణ, భాస్కర్ రెడ్డి, గంగాధర్, శంకరయ్య, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేసిన ఉరవకొండ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గ సభ్యులు

ఉరవకొండ: ప్రజల భాగస్వామ్యం, పాలకవర్గ సభ్యులతో కలిసి ఉరవకొండ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని బ్యాంకు నూతన అధ్యక్షుడు సాధు కుళ్లాయి స్వామి, ఉపాధ్యక్షుడు చెంగల మహేశ్వర తెలిపారు. బుధవారం స్థానిక గాంధీచౌక్ వద్ద ఉన్న టౌన్ బ్యాంకు కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ముందుగా 11 మంది పాలకవర్గ సభ్యులు ప్రవీణ్ కుమార్, కణేకల్లు ఖాజమైనుద్దీన్, గాజుల నాగరాజు, గిద్దలూరు వెంకటేసులు, చెంగలమహేశ్వర, పెద్దకోట్ల రమేష్, పెద్దకోట్ల శ్రీనివాసులు, మూల్లా షేక్ ఇంతియాజ్, మీనుగ ఎర్రిస్వామి, ఎస్. వెంకటస్వామి, సాధు కుళ్లాయిస్వామితో రిటర్నింగ్ అధికారి బాలగంగాధర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు కేవలం ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో బ్యాంకు అధ్యక్షుడిగా కుళ్లాయి స్వామి, ఉపాధ్యక్షుడిగా చెంగలమహేశ్వర పేర్లను ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గ సభ్యులు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు యువనేత ప్రణయ్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందాచంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, పార్టీ పట్టణ కన్వీనర్ బ్యాంకు ఓబులేసు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, కో-ఆప్షన్ సభ్యుడు సలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు మీరం బాషా, పార్టీ సీనియర్ నాయకులు తిరుపాల్‌శెట్టి, ఎంసీ నాగభూషణం, ఆసీఫ్, ఎర్రిస్వామి, రెడ్డి ఆంజనేయులు, ఎర్రిస్వామి, సాధు వెంకటస్వామి, ఆర్‌సీ ప్రసాద్, ఎస్.వెంకటస్వామి, ఇంతియాజ్, గాజుల నాగరాజు, గిద్దలూరు వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, పెద్దకోట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



ఉండబండలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

విడపనకల్లు: చిరుధాన్యాల సాగు లాభదాయకమని మండల వ్యవసాయాధికారి పెన్నయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగు ఏర్పాటుకు దిశగా ఉండబండ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సజ్జ, జొన్న, రాగి, వరిగ, సామలు, ఆరికలు, ఐదలు, ఆండుకొర్రలు తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. గతంలో ఎక్కువ మంది చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండేవారని గుర్తు చేశారు. నేటి సమాజంలో చిరుధాన్యాల సాగు పూర్తిగా మరిచి పోతున్నారని వీటి వల్ల చాలా నష్ట పోతామన్నారు. చిరుధాన్యాల్లో ఎక్కువ శాతం కూడా ప్రోటీన్లతో పాటు మంచి పోషకాలు ఉంటాయన్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, స్థూలకాయత్వం, ఆస్తమా, రొమ్ము క్యాన్సర్ రావన్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 నుంచి 60 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు గ్రామంలో చిరుధాన్యాల సాగుపై రైతులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఏఈఓ రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి మునాఫ్, విడపనకల్లు సొసైటీ చైర్మన్ శ్రీరాములు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది రవి, నాగరాజు, శాంతారాం, రామలింగ, రాజేశ్వరి, శంకరమ్మ, ఎంపీఈఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల నిషేధానికి సహకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: ప్లాస్టిక్ ఫ్లెక్సీలను 26వ తేదీ నుంచి నిషేధించడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే షాపుల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ తన చాంబర్‌లో ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగ వస్తువులతో పాటు ఫ్లెక్సీల నిషేధానికి వ్యాపారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్వచ్ఛ రాయదుర్గంగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధించడం జరిగిందన్నారు. మరోవైపు పట్టణంలోని షాపుల యజమానులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను తొలగించుకోవాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఉరవకొండ క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్ హనుమేష్

వజ్రకరూరు: స్త్రీనిధి రుణాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని ఉరవకొండ క్లస్టర్ స్త్రీనిధి మేనేజర్ హనుమేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనలో వైకేపీ ఏపీఎం గుణశ్యాం అధ్యక్షతన స్త్రీనిధి రుణాలు, రికార్డుల నిర్వహణ, బ్యాంకు లింకేజీ, అజెండా తదితర అంశాలపై అనిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక నుంచి స్త్రీనిధి రుణాలను ఒక్కో సంఘం సభ్యురాలికి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ మంజూరు చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఒక్కో సంఘంలో కనీసం నలుగురు సభ్యులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తీసుకున్న రుణాలను 23 కంతుల్లో చెల్లించాలన్నారు. కేవలం ఒక్క రూపాయి వడ్డీ మాత్రమే పడుతుందని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, స్త్రీనిధి రుణాలు చెల్లించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు ఓబులేసు, రామాంజినేయులు, నారాయణస్వామి, ఖాజా పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్‌కు సన్మానం

వజ్రకరూరు: విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించిన హెల్త్ అసిస్టెంట్ బాబావలి వైద్య వృత్తికే వన్నె తెచ్చారని వైద్యులు తేజశ్వి, సర్దార్‌వలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కమలపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో కొనకొండ్లకు బదిలీ అయిన హెల్త్‌అసిస్టెంట్ బాబావలిని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు తేజశ్వి, సర్దార్‌వలి, సీహెచ్ఓ గంగాధర్, ఎంపీహెచ్ఈఓలు గురు ప్రసాద్, శ్రీరాములు, హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఫార్మాసిస్టు బాలయ్య పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శెట్టూరు: పెరుగుపాళ్యం పంచాయతీలోని రాంనగర్‌లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, పార్టీ మండల కన్వీనర్ శివన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి ఉషశ్రీచరణ్ గ్రామంలోని ప్రతి గడప గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు.

లో-ఓల్టేజీ సమస్య పరిష్కారం

కూడేరు: మండల పరిధిలోని కొర్రకోడు, హంసాయపల్లి, కొర్రకోడు డ్యాం గ్రామాలకు ట్రాన్స్‌కో ఏఈ గౌస్ బుధవారం రెండు ఫీడర్లు ఏర్పాటు (బైఫర్‌గేషన్) చేసి విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామాలకు లో-ఓల్టేజీ సమస్య తీరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏఈ గౌస్‌ను సన్మానించారు.

చింతపండు కొనుగోళ్లు ప్రారంభం

రాయదుర్గం: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఈ-నామ్ పద్ధతిలో చింత పండు కొనుగోళ్లను యార్డు చైర్మన్ భోజరాజ్ నాయక్, కార్యదర్శి సునీత ప్రారంభించారు. మొత్తం 19 లాట్లు వేయగా ఫ్లవర్, కర్పూర్ అనే రెండు రకాలు విడిగా వేసి ధర కట్టారు. ఇందులో మొదటి రకం రూ.13,500 పలకగా.. రెండో రకం ధర రూ.5,500 నిర్ణయించారు. మోడల్ ధర రూ.6 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు నష్టం లేకుండా పారదర్శకంగా వ్యాపారా లావాదేవీలు చేపట్టాలని సూచించారు.

ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ

కుందుర్పి: మండలంలోని మలయనూరులో మంగళ, బుధవారాల్లో గుడికల్లు అల్లీపీరల స్వాముల నూతన ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ అఖండ భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ నిర్మాణానికి మలయనూరు గ్రామ భక్తులు, ఎంపీ లక్ష్మీపతి, జగన్నాథ్ తదితరులు 4 ఎకరాల స్థలాన్ని విరాళంగా గుడికల్లు ట్రస్టుకు అందజేశారని గుడికల్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గుడికల్లు ఆశ్రమ పీఠాధిపతులు గాజీ ఉసేన్‌పీరా స్వామి, ఆయన తనయుడు అమీద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి

బ్రహ్మసముద్రం: మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు సంబంధించి మండల కన్వీనర్‌గా కంభం చంద్రశేఖర రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా పని చేస్తానని చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు.

నేడు గణతంత్ర వేడుకలు

- హాజరుకానున్న విప్ కాపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు, మున్సిపల్ కార్యాలయంలో 8:30 గంటలకు జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం

కుందుర్పి: లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి తదితరులు తెలిపారు. రథోత్సవంలో మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. రాత్రికి దూళోత్సవం సందర్భంగా భక్తుల సాయంతో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



8వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు ప్రభుత్వం తక్షణం స్పందిస్తూ పనులు ప్రారంభించింది. మున్సిపాలిటీ పరిధిలోని 8వ, 21వ వార్డుల్లో ఇటీవల రాష్ట్ర స్త్రీ శిశు, సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్థానిక కౌన్సిలర్లతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రిని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి.. 8వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, 21వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కో-ఆప్షన్ సభ్యుడు అష్ఫల్ తదితరులు ఆయా వార్డుల్లో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాపూజీ, చిన్నా, హబీబ్ పాల్గొన్నారు.

ఎంపీపీకి పితృ వియోగం



పాడె మోస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాయదుర్గం ఎంపీపీ విద్యావతి, పార్టీ ముఖ్య నాయకుడు బోర్‌వెల్ నాగిరెడ్డి తండ్రి శివారెడ్డి (85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి పలు కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. శివారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. శివారెడ్డి స్వగ్రామం బొమ్మక్కపల్లిలో అంత్యక్రియలు నిర్వహించగా.. విప్ కాపు పాడె మోశారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

బొమ్మనహాళ్: చంద్రగిరి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో 108 శివలింగాల ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం 108 శివలింగాలు, కలశాలు, నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. సంస్థాన కల్‌హోళ మఠం, పాల్తూరు, మ్యాళిగనూరుకు చెందిన చన్నవీర శివాచార్య స్వాములు, బళ్లారికి చెందిన పంపాపతి శాస్త్రి, ఆలూరు తాలుకా, కొక్కరచేడు గ్రామానికి చెందిన శివశరణమ్మ పూజా కార్యక్రమాల్లో పాల్గొని 108 శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం పండీపురానికి చెందిన చైతన్య సద్గురు గోపాల్ మహారాజు ఆధ్వర్యంలో 108 శివలింగాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీ ఎంపిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు వీరే..

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న గుడ్‌షెప్పర్డ్ చర్చిలో క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా పాస్టర్ ఇస్మాయిల్, అధ్యక్షుడిగా ఫాస్టర్ ఆరోగ్య నాతాన్, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ ఆనంద్, కార్యదర్శిగా పాస్టర్ జాషువానంద్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ విక్రమ్‌పాల్, కోశాధికారిగా పాస్టర్ సురేష్, గౌరవ సలహాదారులుగా పాస్టర్ ప్రభాకర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఉరవకొండ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న దాదాపు 70కు పైగా చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం



కళ్యాణదుర్గం రూరల్: నారాయణపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



రాయదుర్గం రూరల్: విద్యార్థులకు ఓటరు కార్డులు అందజేస్తున్న అధికారులు

విడపనకల్లు/కళ్యాణదుర్గం రూరల్/ఉరవకొండ/రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం/బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్/వజ్రకరూరు/బ్రహ్మసముద్రం/కణేకల్లు: కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పోలింగ్ కేంద్రాల్లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ కలెక్టర్ కేశవరాయుడు పేర్కొన్నారు. రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ర్యాలీలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుంబిగించాలన్నారు. ఓటు హక్కుపై ఉద్యోగులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు లేని వారందరూ కచ్చితంగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వజ్రకరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు దినోత్సవం సందర్భంగా మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.